జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 8-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 419 పేజీలు: 4 వెల : రూ.7




# తహసీల్దార్‌పై.. వేటు?

* ఏసీబీ కేసుతో షాక్! * ఎన్.వెంకట్రావుపై తీవ్ర ఆరోపణలు
* జీవో 830 విడుదల చేసిన ప్రభుత్వం

శ్రీకాకుళం, ఆగస్టు7 (వార్త): ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర చర్యలకు ఉపక్రమించింది. శ్రీకాకుళం జిల్లా తహసీల్దార్ నదిగట్ల వెంకటరావుపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు రెవెన్యూ విభాగం ఒక ఉత్తర్వులను జారీ చేసింది. ఏసీబీ కేసులో చిక్కుకున్న తహసీల్దార్‌పై ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కేసు పూర్వాపరాలు..

శ్రీకాకుళం జిల్లా కేంద్రం తహసీల్దార్‌గా గతంలో పనిచేసిన ప్రస్తుతం ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న నదిగట్ల వెంకటరావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన ఒక ఏడాది కాలంలోనే అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. వీటిలో ప్రధానమైనవి రెండు. కుటుంబ సభ్యుడి ధృవీకరణ పత్రం తిరస్కరణ, ఒక దరఖాస్తుదారు కుటుంబ సభ్యుడి ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం పర్యవేక్షకులు హాజరు కాలేకపోయినా, పత్రాలను ఆమోదించవచ్చు. అయితే, తహసీల్దార్ ఈ దరఖాస్తును నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించారు. ఇది అధికారుల విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.

ఏసీబీ వల పన్నిన కేసు..

జాఫర్ గౌరీ అనే వ్యక్తి నుంచి తహసీల్దార్ రూ.5,000 లంచం డిమాండ్ చేశారు. దీనిపై సదరు వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో, ఏసీబీ అధికారులు వల పన్నారు. కేసు నమోదు చేశారు. ఆ తర్వాత దరఖాస్తును తిరస్కరించడం ద్వారా తన అధికారాలను దుర్వినియోగం చేసినట్లు ఏసీబీ విచారణలో తేలింది.

ప్రభుత్వ చర్యలు..

ఈ ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తహసీల్దార్ నదిగట్ల వెంకటరావుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో భాగంగా సంబంధిత సాక్ష్యాలు, ఫిర్యాదులు, ఫైళ్లు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. తహసీల్దార్ అధికారిక విచారణకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చుకునే అవకాశం ఆయనకు ఉంటుంది. విచారణ పూర్తయిన తర్వాత ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇది అవినీతికి పాల్పడే ఉద్యోగులకు ఒక గట్టి హెచ్చరిక అని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



# విద్యార్థులు.. రైతులయ్యారు!

* వరినాట్లు నాటిన విద్యార్థులు
* క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పద్ధతులు పరిశీలించిన నగరంపల్లి హైస్కూల్ విద్యార్థులు


పలాస, ఆగస్టు7 (వార్త): విద్యార్థులు.. రైతులయ్యారు. ఏకంగా వరి పొలంలోకి వెళ్లి నాట్లు వేశారు. అక్కడే ఉన్న రైతులను కలిసి వ్యవసాయ పద్ధతులను తెలుసుకున్నారు. నేల దున్నడం, చదును చేయడం, విత్తనాలు జల్లడం, నాట్లు నాటడం, ఎరువులు వేయడం, కోతలు, నూర్పులు తదితర విషయాలను క్షుణ్ణంగా అడిగి మరీ నేర్చుకున్నారు.. పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు పొలాల్లో ఏం పని అనుకుంటున్నారు.. కదూ.. ఇదేదో మహేష్‌బాబు నటించిన మహర్షి సినిమా చూసి విద్యార్థులు ఇలా చేశారనుకునేరు. కాదండి బాబు.. పలాస మండలం నగరంపల్లి హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థులు.. తాము తరగతి గదిలో నేర్చుకున్న 'పంటల ఉత్పత్తి' అనే పాఠంలోని విషయాలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకునేందుకు గురువారం పంటపొలాలు సందర్శనకు వెళ్లారు. పాఠశాలలోని ఎన్జీసీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పొలాలను సందర్శించి అక్కడ రైతులను కలిసి వ్యవసాయ పద్ధతులను తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు, పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మిపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, గొర్లె విశ్వనాధరావు, పీడి పైల గజేంద్రరావు, రైతు టి.లోకనాధం పాల్గొన్నారు.




శ్రీముఖలింగేశ్వర ఆలయ

# పవిత్రతకు భంగం

* ఆలయ ఆవరణలో మాంసం కొట్టు
* ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



జలుమూరు, ఆగస్టు 7 (వార్త): ప్రముఖ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయానికి ఎంతో పేరు ఉంది. అలాంటి ఆలయ ప్రాంగణంలో ఓ వ్యక్తి చికెన్, మటన్, చేపలు వంటి మాంసాహార పదార్థాలను విక్రయిస్తున్నాడు. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో మాంసాహార దుకాణం చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఇదేం పని అని మండిపడుతున్నారు. ఆలయ పవిత్రతను భంగం కలిగిస్తున్నా ఆలయాధికారులకు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జలుమూరు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి, దేవదాయ శాఖ దృష్టికి తీసుకువెళతామన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**కొత్తూరు, ఆగస్టు 7 (వార్త) :** కొత్తూరు మండలానికి చెందిన జర్నలిస్టులు జీవో ఎంఎస్ నెంబర్ 43 ప్రకారం తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గురువారం మండల తహసీల్దార్ కె.బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సంబంధిత ప్రక్రియలు పూర్తయిన అనంతరం చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాసరావు, అల్లు భగవాన్, పొగిరి గోవిందరావు, గోవాల రాంబాబు, ఎద్దు నాగరాజు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఒడిశా వ్యక్తి దుర్మరణం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** ఒడిస్సా రాష్ట్రం బౌద్ధ టౌన్‌కి చెందిన రాజేంద్రప్రసాద్ చౌదరి (69) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన స్వగ్రామమైన కాశీనగర్ దరి కొల్ల హరిపురంలోని పొలాలను చూడడానికి తన సొంత జీప్‌లో వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా, బెల్లుపడ పాత టోల్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న ట్రిప్పరు డ్రైవరు స్పీడ్‌గా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసుకుని వచ్చి ఢీ కొట్టాడు. దీంతో రాజేంద్రప్రసాద్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు చిన్నయ్య చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఏఎస్ఐ చక్రధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అసమానతలు ఉన్నంతవరకు పోరాటం



**-కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి చరిత్రలో చిరస్మరణీయులు**

**-పలువురు వక్తలు ప్రసంగాలు**

**పలాస, ఆగస్టు 7(వార్త):** అసమానతలు ఉన్నంతవరకు పోరాటాలు పుడతాయని వక్తలు అన్నారు. భారత విప్లవ సాంస్కృతికోద్యమం నాయకుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సహచరిణి కామ్రేడ్ సురేఖమ్మ సంతాప సభ గురువారం బొడ్డపాడులో నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షులుగా అమరుల బంధుమిత్రుల సంఘం జిల్లా బాధ్యులు తామాడ త్రిలోచనరావు వ్యవహరించారు. సిపిఐ యంయల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళ ఉద్యమంలో కామ్రేడ్ పాణిగ్రాహి నాయకత్వ పాత్రను, అదే సమయంలో మితవాదనలకు వ్యతిరేక పాత్రని వివరించారు. విరసం అధ్యక్షులు కామ్రేడ్ అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ నక్సల్ బరి శ్రీకాకుళం వారసత్వం నేడు దండకారణము వరకు కూడా కొనసాగుతా ఉన్నదని, మధ్యభారతంలో జరుగుతున్న ఆదివాసీలపై యుద్ధం మావోయిస్టుల బూటుకపు ఎన్‌కౌంటర్లను ఖండిస్తూ శాంతి చేర్చుల కోసం వాళ్ల ప్రతిపాదనను ప్రభుత్వం స్వీక రించి తక్షణమే శాంతి చర్చలు జరిగేలా ప్రయత్నించమని, అమరుల వారసత్వాన్ని, కొనసాగించడమే నిజమైన నివాళులన్నారు. అరుణోదయ రాష్ట్ర బాధ్యులు సన్నశెట్టి రాజశేఖర్ రచన చేసిన పాటలను ఆట పాటలతో ప్రజలను ఆకర్షించారు. జముకుల కథ పాటలను వినిపించారు. రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకులు కామ్రేడ్ వర్మ మాట్లాడుతూ నేడు భారతదేశంలో పెట్టుబడిదారీ విధానము సామ్రాజ్యవాదం సంక్షోభంలో ఉందని, ఈ సమయంలో విప్లవోద్యమ శక్తులు కలసి ఉద్యమించాల్సిన పరిస్థితులు నేడు దేశంలో ఉన్నాయని, హిందూ ఫాస్టర్ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ యంయల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ హరినాథ మాట్లాడుతూ భారతదేశంలో ఏ చోట అమరత్వం జరిగిరా బొడ్డపాడు కేంద్రంగా అమరుల శరీరాలను తీసుకొచ్చి తమ బిడ్డలుగా స్వీకరించి, అంత్యక్రియలు చేయడం ప్రత్యేకత అని, ఈ స్ఫూర్తి ఆనాడు శ్రీకాకుళ పోరాటం అందించిందని, అమరుల సూచనల మేరకు ఆ వారసత్వాన్ని కలిగి ఉందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఈ చరిత్ర కంటిన్యూ అవ్వాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. పౌర హక్కుల సంఘం జిల్లా బాధ్యుల పత్తిరి దానేష్ మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని కగార ఆపరేషన్ను నిలుపుదల చేయాలని శాంతి చర్చలకు పాలకులు పూనుకోవాలని పిలుపునిచ్చారు . సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు మాట్లాడుతూ శ్రీకాకుళ పోరాటంలో పాణిగ్రాహి పాత్రను ఆయన నాయకత్వం వహించిన పాత్రను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. నేడు దేశంలో అవే పరిస్థితులు ఉన్నయని దాన్ని ఎదుర్కోవటానికి మనమందరము పునర్ అంకితం అవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. అరసం రాష్ట్ర నాయకులు సిహెచ్ కృష్ణ మాట్లాడుతూ హిందూ ఫాశిష్ట విధానాలను సరళమైన భాషలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే అని గట్టిగా చెప్పారు . సిపిఐ ఎంఎల్ జనశక్తి నాయకులు జనశక్తి నాయకులు రమేష్ మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని కొనియాడారు. ప్రజా కళామండలి రాష్ట్ర బాధ్యులు నీలకంఠం తన బృందంతో విప్లవ గీతాలను పాణిగ్రాహి రచన చేసిన పాటలను ఆటపాటల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచారు. పాణిగ్రహం ఒకసారి నెమర వేసుకుని స్థితి కల్పించారు. ఈ సభలో గ్రామ ప్రజలతోపాటు, వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేసి సభను విజయవంతం చేశారు. ప్రత్యంగా, పరోక్షంగా ప్రజలు సహాయం సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఐప్వా నాయకులు కామ్రేడ్ తామాడ, పోతనపల్లి అరుణ, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, దాసరి శ్రీరాములు, కైలాస్, మురళి, నాగమణి, దీపు యువకులు సహకారంతో సభ విజయవంతమైందని కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహణ కమిటీ తెలిపింది.

# పీ 4 సర్వేను ఖచ్చితంగా నిర్వహించండి

**- పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, ఆగస్టు 7(వార్త):** ఇంటింటికి వెళ్లి పీ4 సర్వేను పూర్తిస్థాయిలో కచ్చితంగా నిర్వహించాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కోరారు. గురువా రం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ప్రస్తుతం జరుగుతున్న పీ 4 సర్వే ప్రగతిపై అన్ని సచివాలయంల అడ్మిన్ కార్యదర్శులతో పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పి 4 సర్వేను తొందరగా పూర్తి చేయ వలసిందిగాను, ఈ సర్వేపై అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకొనుటకు కూడా వెనుకాడేది లేదని కమిషనర్ సెక్రటరీలను హెచ్చరించారు. అన్ని సచివాలయంల పరిధిలో అందరు కార్యదర్శులు కూడా ప్రతి ఇంటికి వెళ్లి జి.పి.ఎస్. ద్వారా సదరు కుటుంబం పూర్తి వివరములు నిర్ణీత ఫార్మాట్ లో పూర్తి చేసి సదరు కుటుంబాన్ని ఫొటో తీసి అప్లోడ్ చేయవలసిందిగా తెలియజేశారు. ఈ సమాచారాన్ని ఇచ్చిన వ్యక్తి ఆ కుటుంబంలో సభ్యులా? కాదా? అనే వివరములతో పాటు ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తి పూర్తి వివరములు



కూడా ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయవలసిందిగా తెలియజేశారు. ఈ సర్వేలో ఖచ్చితమైన పేదవారిని గుర్తించి వారిని బంగారు కుటుంబముగా నమోదు చేసి వారి ప్రగతికి తోడ్పడే విధంగా ప్రతి కార్యదర్శి కూడా ఈ సర్వే ను ఖచ్చితంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.



## 82మంది యువకుల రక్తదానం

**ఆమదాలవలస, ఆగస్టు 7(వార్త):** కృతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ వినోద్ కిడ్స్ హాస్పిటల్ వారి సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఆమదాలవలసలోని సువ్వారి కల్యాణమండపంలో గురువారం నిర్వహించారు. 85మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ పి తాతయ్యలు, డాక్టర్ సిహెచ్ సుధాకర్, సీపాన హేమమోహన్, కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి. చిన్నూ, నవ్య, కృష్ణ, దీప, బగాది నేతాజీ, కృష్ణ, బమ్మిడి రాము, యశ్వంత్, వసంత్, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మందస సత్యసాయిబాబా మందిరంలో వరలక్ష్మీ వ్రతం

**మందస, ఆగస్టు 7(వార్త):** మందసలోని భగవాన్ శ్రీసత్యసాయిబాబా దివ్య అనుగ్రహ ఆశీస్సులతో.. గణేష్ శర్మపంతులు ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా మందిరం(బృందావనం)లో ఈ నెల 8న ఉదయం 9.30గంటలకు వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పూజా ద్రవ్యములతో విచ్చేసి, కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించి లక్ష్మీమాత, భగవాన్ శ్రీసత్యసాయిబాబా దివ్య అనుగ్రహ ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జయప్రదం చేయాలి



**మందస, ఆగస్టు 7(వార్త):** ప్రపంచ ఆదివాసీదినోత్సవం జయప్రదం చేయాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు కోరారు. ఆదివాసీ వికాస పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆదివాసీలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జగన్, డొంబురు, గణేశ్వరరావు, అప్పారావు, విజయ్, అబ్రహం, బెరింగి అప్పారావు, జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ డిఎస్‌పి వీవీ అప్పారావు అన్నారు. జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం నారీశక్తి, సైబర్ క్రైమ్, యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మా పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నారీశక్తి యాప్ గూర్చి విద్యార్థులందరూ అవగాహన పెంచుకోవాలని, బాలికలకు రక్షణ కల్పించే చట్టాలు గూర్చి, చాలామంది అత్యవసర సమయంలో సంప్రదించవలసిన నెంబర్లు గూర్చి వివరించారు. బాలికల భద్రత కోసం జ్ఞాన భారతి పాఠశాల తీసుకుంటున్న చర్యలను అభినందించారు. సైబర్ నేరాలు పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకులు కూడా తమ ఖాతాదారులను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉంటాయని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రరిమాణాలు తెలుసుకోవాలని సలహా ఇచ్చారు. విద్యార్థులు తమ విద్యపై, లక్ష్యాలపై దృష్టి పెట్టి జీవితంలో అత్యుత్తమ స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం. చిన్నంనాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ ఐబీ పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, పరిపాలన అధికారిని సయదాసుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎమ్మెల్యేకు చేనేత వస్త్రాలు అందజేత

**శ్రీకాకుళం/లావేరు, ఆగస్టు 7(వార్త):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అప్పాపురం గ్రామానికి చెందిన చేనేత కార్మికులు టీడీపీ నాయకుడు బాసిన దాలిరాజు అధ్యర్యంలో గురు వారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు చేనేత వస్త్రాలను బహుకరించారు. అనంతరం చేనేతకార్మికులకు నేతన్న భరోసా రూ 25 వేలు ఆర్థిక సహాయన్ని ఇవ్వడం మరమగ్గాలు చేతిమగ్గాలు కలిగివున్న చేనేత కార్మికు లకు 200, యూనిట్ లు ఉచిత విద్యుత్ ను ప్రభు త్వం ప్రకటించడం సంతోషంగా ఉందని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టశ్రీను పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.





## లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా సేవలు

**శ్రీకాకుళం, ఆగస్టు 7(వార్త):** పదవీ విరమణ చేసిన సైనికుల న్యాయ అవసరాల పరిష్కారానికి తోడ్పడేలా 'జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వీర్ పరివార్ సహాయత యోజన - 2025' అనే కొత్త పథకాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జూనైద్ అహ్మద్ మౌలానా ప్రారంభించారు. ఈ పథకాన్ని స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీస్ క్లినిక్‌లో ప్యానెల్ లాయర్, పారా లీగల్ వాలంటీర్‌ను నియమించామని, వీరి సేవలను సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. న్యాయ పరంగా ఎదురయ్యే వివిధ సమస్యలకు ఉచిత సలహాలు, సాయం అందించేందుకు ఈ క్లినిక్ పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, ప్యానెల్ అడ్వకేట్ వి. జ్యోతిర్మయి, పారా లీగల్ వాలంటీర్ కే. ఆదిత్య కుమార్, అడ్వకేట్ జి. ఇందిరాప్రసాద్, ఇన్చార్జి సూపరిండెంట్ ఎస్. ఈశ్వర్‌రావు, మాజీ సైనికులు కెప్టెన్ పి. ఈశ్వరరావు, ఎస్.ఎన్. మూర్తి, కె. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా 75వ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**శ్రీకాకుళం, ఆగస్టు 7(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఆగస్టు 13 నుండి 15 వరకు జరిగే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన ఈ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే వేడుకలు జిల్లాలోని సాంస్కృతిక, చారిత్రక, ఆదివాసీ వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలని తెలిపారు. శోభా యాత్రకు బదులు ఐదువేల మందితో మారథాన్, యువజన క్రీడలు, సమ్మిట్, విద్యార్థుల కోసం చరిత్ర, క్విజ్, వ్యాసరచన పోటీలు, పైలాన్ ప్రారంభోత్సవం, ఆదివాసీ కళల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్వాక్రా బజార్, ఫుడ్ స్టాల్స్ వంటివి ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా జిల్లాకే తలమానికంగా నిలిచే వంటలు, మన జిల్లాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచే గ్రామీణ పోటీలు నిర్వహించడం కోసం కమిటీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొననున్న ఈ ఉత్సవాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, భద్రత, మెడికల్, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు.

# చేనేత వస్త్రధారణతో.. ఆరోగ్యం

- నేత వస్త్రాలు ధరిస్తే.. కార్మికులకు ప్రోత్సాహం
- నేతన్నలను ఆదుకునేది కూటమి ప్రభుత్వమే
- ఎమ్మెల్యే గొండు శంకరరావు
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**శ్రీకాకుళం, ఆగస్టు 7(వార్త):** చేనేత వస్త్రధారణతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని, అదే సమయంలో చేనేత కార్మికులకు అండగా ఉంటూ ప్రోత్సహించ వచ్చని స్థానిక శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకరరావు సూచించారు. గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటుచేసిన వేడుకలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చేనేత వస్త్రధారణతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయని, అదేవిధంగా చేనేత వస్త్రాలు కొనుగోలుతో చేనేత కార్మికులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వివరించారు. బ్రిటిష్ టైం లో విదేశీ వస్త్ర బహిష్కరణ నినాదంతో బాపూజీ, తర్వాత రాష్ట్రంలో ప్రగడ కోటయ్య అనేక ఉద్యమాలు చేసి చేనేతల ప్రోత్సహించారని గుర్తు చేశారు. అణగారిపోతున్న చేనేత రంగాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో కూడు, గూడు, గుడ్డ నినాదంతో స్వర్గీయ ఎన్. టి. రామారావు చేనేత కార్మికులను ఆదుకున్నారని తెలిపారు. అదే బాటలో ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతన్న భరోసాను 24 వేల నుండి 25 వేలకు పెంచడం, నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు కల్పించడానికి నిన్ననే క్యాబినెట్ ఆమోదించిందని తెలిపారు. అదేవిధంగా జిఎస్టిపై ఐదు శాతం రాయితీ, చేనేత ఇన్సూరెన్స్ లాంటి పథకాలను అమలు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రానున్న రోజులలో అవసరమైన కెమికల్స్ రంగులు చేనేత శాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కామర్స్ అభివృద్ధి చేసి చేనేత వస్త్రాలు ఇ కామర్స్ ద్వారా అమ్మేందుకు, కొత్త కొత్త డిజైన్లపై నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అనేక సొసైటీలు ఉన్నప్పటికీ పలు సొసైటీలు నష్టాల్లో ఉన్నాయని వాటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ మాట్లాడుతూ 500 మంది చేనేత కార్మికులతో ఉత్పత్తి సంఘం ఏర్పాటు చేశామని తద్వారా ఐదారు వందల వచ్చే ఆదాయం 1200కు పెరిగిందని తెలిపారు. నాబార్డ్ తరఫున అవసరమైన శిక్షణలో అందిస్తామన్నారు. ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సన్యాసిరావు మాట్లాడుతూ స్థానిక మార్కెట్ను క్యాప్చర్ చేయడం ద్వారా చేనేత వస్త్రాలను




అధికంగా అమ్మటానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రత్తి పంట నుండి వస్త్ర తయారీ వరకు ఉన్న అన్ని రంగాలలో చేనేత కార్మికులు కష్టపడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చేనేత ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ముందుగా శ్రీకాకుళం పురపాలక సంఘం కార్యాలయం నుండి బాపూజీ కళామందిర్ వరకు హ్యాండ్లూమ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో హ్యాండ్లూమ్స్ ఏడి టీ జనార్దన్ రావు, రెడ్ క్రాస్ సెక్రటరీ జగన్మోహన్ రావు, ఇంటాక్ట్ ప్రతినిధి జగన్నాథరావు నాయుడు, వివిధ చేనేత సొసైటీల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, కృష్ణారావు, కే ప్రసాద్, కె. రవి, ఎం గణపతి రావు, కె. కృష్ణారావు, కే.కాంతారావు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని సిద్ధం చేయాలి

- జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
- జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం పరిశీలన



**శ్రీకాకుళం, ఆగస్టు 7(వార్త):** ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం, తండేవలసలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు గురువారం సందర్శించి, శిక్షణకు కావలసిన పూర్తి స్థాయి ఏర్పాట్లును పరిశీలించారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ట్రైన్ పోలీస్ కానిస్టేబుల్ రానున్న రోజుల్లో శిక్షణ పొందేందుకు శిక్షణ కేంద్రంలో మైదానం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలనీ జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. శిక్షణా కేంద్రంలో మైదానాన్ని, తరగతి గదులు, బ్యారెక్స్, మంచి నీటి సరఫరా, మెస్, భోజనం, స్నానపు గదులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను జిల్లా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శిక్షణ నిమిత్తము అవసరమగు వస్తు సామగ్రి, మౌలిక సదుపాయాలు వివరాలను అదేవిధంగా ఎటువంటి మరమ్మతులు ఉన్న యెడల తక్షణమే ప్రతిపాదనలు నివేదిక రూపంలో పంపించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. సిబ్బంది వివరాలపై ఆరా తీసి శిక్షణ కేంద్రంలో తరగతి గదులను, భోజనం గదులను, బ్యారక్‌లను, స్నానపు గదులను పరిశీలించి అదనంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి అదనపు ఎస్పితో కలిసి జిల్లా ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కేంద్రంలో పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించి, శిక్షణార్థులకు శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే మైదానాలను పరిశీలించారు. క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ఆదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు ఇమ్మన్యుల్ రాజు, పైడిపు నాయుడు, అవతారం, ఆర్ఐలు నర్సింగరావు, శంకర్ ప్రసాద్, ఎస్సైలు రవి కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

# పేద విద్యార్థినులకు లయన్స్ ఆదుకుంటుంది

- లయన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపకులు లక్ష్మణరావు
- ప్రభుత్వ మహిళ కళాశాలకు బయో మెట్రిక్ పరికరం అందజేత

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 7 (వార్త):** పేద విద్యార్థినిలకు అండగా నిలుస్తామని, ప్రముఖ విద్యావేత్త, వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపకులు బరాటం లక్ష్మణరావు న్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాఠశాలలో విద్యార్థినుల కోసం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు, జెమ్స్ వైద్యశాల వైద్యులు డా.డి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బయోమెట్రిక్ పరికరాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డా. డి.సుజాత మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సేవలు అమోఘమని, గతంలో మా పాఠశాలకు అనేకవిధాలుగా లైన్స్ క్లబ్ సభ్యులు అండగా నిలిచారని, ప్రతీ పేద విద్యార్థినికి మా వంతు సహకారమందిస్తామనటం ఆనందదాయకమన్నారు. బరాటం లక్ష్మణ రావు ఒక పేద విద్యార్థిని దత్తత తీసుకున్నారని, గడిచిన మూడేళ్ళుగా అండగా ఉంటున్నారన్నారు. డా. ప్రవీణ్, బరాటం. లక్ష్మణరావు మాట్లాడుతూ బయోమెట్రిక్ అమలు చేయడం ద్వారా ఖచ్చితమైన రికార్డులను నిర్వహించవచ్చున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 41,061 ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల హాజరు, సమయపాలనను నిర్ధారించడానికి బయోమెట్రిక్ వ్యవస్థలను కూడా ఉపయోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్ష సభ్యుల బృందం, ఆర్సీ డా.చింతాడ. కృష్ణ మోహన్, సేవకులు ఉర్లం శివతేజ, విద్యార్థినిలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 10 కిలోల గంజాయితో మహారాష్ట్ర యువకుడి అరెస్టు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** ఎం.తోటూరు ఎల్‌సీ గేటు వద్ద 10.180 కిలోల గంజాయితో మహారాష్ట్ర కి చెందిన విశాల్ రమేష్ కిర్తనేని రూరల్ ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు అరెస్ట్ చేసినట్లు కాశిబుగ్గ డీఎస్‌పీ వీవీ అప్పారావు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో గనపతి కిర్తనే.. గజపతి జిల్లాకి చెందిన జిత్తు వద్ద గంజాయి తీసుకుని కిలో వెయ్యి రూపాయలకు కిరాయికి తరలిస్తుండగా అరెస్టు చేశారని తెలిపారు. ఇలా ఇప్పటికి మూడు సార్లు తరలించారని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ ఎం.చిన్నంనాయుడు పాల్గొన్నారు.



## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు గురువారం నిర్వహించారు. బాలికోన్నత పాఠశాల లో నిర్వహించిన పోటీ లో శాంతినికేతన్, హెబ్రాన్, బాలికొన్నత పాఠశాల, జ్ఞానభారతి విద్యార్థులు పాల్గొన్నారు. లక్ష్మీ, కావ్య, వినీల విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మోహన్ వెంకటేష్, రామకోటి, రామారావు, వేద వ్యాస్, దినేష్, తులసీదాస్, షణ్ముఖ, కృష్ణ మూర్తి రెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం రద్దు

**- ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి**



**పలాస, ఆగస్టు 7(వార్త):** కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమం ఈ శుక్రవారం (వరలక్ష్మి వ్రతం) ప్రభుత్వ సెలవు సందర్భంగా నిర్వహించడం లేదని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు వినతలు తెలిపేందుకు రావద్దని ఆయన కోరారు.

## శ్రీముఖలింగం పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



**జలుమూరు, ఆగస్టు 7 (వార్త):** శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ఫిల్టర్ యూనిట్ వితరణగా అందజేశారు. గురువారం స్థానిక పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థిని డాక్టర్ బసవ రాజా నందిని దీనిని అందజేశారని ఉపాధ్యాయులు ధర్మవరపు శ్రీనివాసరావు తెలిపారు. నందిని మాట్లాడుతూ..ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుని వైద్య వృత్తిలో కొనసాగుతున్నానని తెలియజేశారు. పలువురు ఆమెను అభినందించారు.

# రెడ్‌బుక్ రాజ్యాంగంతోనే దాడులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ఆర్.రమేష్‌యాదవ్‌పై దాడిని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ ఖండించారు. వైయస్సార్ కడప జిల్లా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండపల్లి గ్రామంలో కారులో ప్రయాణిస్తుంటే, కారును అడ్డగించి, కారును పగలగొట్టి కారులో ఉన్న రమేష్‌యాదవ్ మీద తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీకి అప్పుడే ఓటమి భయం పట్టుకుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా, అరాచక పద్దతిలో గెలిపించాలని చూస్తున్నారన్నారు.. ఈ దాడి రాష్ట్రంలో, బడుగు బలహీన వర్గాల మీద జరిగిన దాడి.అని అన్నారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం మాత్రమే అమలు జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్ఆర్సిపి అన్ని విభాగాల శ్రేణులు పై దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ వేధింపులు అక్రమ కేసులు, అక్రమ నిర్బంధం విపరీతంగా పెరిగిపోయాయని సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి, ఆగ్రహాలను పక్కదారి పట్టించడానికి నెలకు ఒక అంశాన్ని తెరపై తీసుకువచ్చి డైవర్షన్ పాలిటిక్స్ నెరుపుతున్నారని. ఎటువంటి పరిస్థితుల్లోనూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్ఆర్సీపీ కైవసం చేసుకుంటుందన్నారు.

**పలాస, ఆగస్టు 7(వార్త):** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ఆర్.రమేష్‌యాదవ్‌పై టీడీపీ నేతలు దాడి చేయడం అప్రజాస్వామికం అని అఖిల భారత యాదవ మహాసభ (అహిర్) రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి , వైయస్సార్సీపి నేత గద్దె బోయిన గుర్నాథ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పలాసలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు కొలమానమని కూటమి నేతలు అందుకు భిన్నంగా ప్రవర్తించి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారన్నారు. నేతలు ఎవరికి వారు ప్రచారం చేసుకోవాలని అంతిమంగా ప్రజల తీర్పును గౌరవించాలి తప్ప ఇటువంటి భౌతిక దాడి చేయడం చేయమన్నారు. ఈ దాడిని ప్రజాస్వామ్య



వాదులందరూ ఖండించాలన్నారు. కూటమి నేతలు భౌతిక దాడులతో ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ప్రజలలో చులకన కావద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మొదలైన వ్యతిరేకతను అణచివేయడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతు న్నారన్నారు. ఈ దాడి రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిగా మాత్రమే కాకుండా యావత్ బీసీ సామాజిక వర్గాలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాత చర్యలు తీసుకొని దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజాస్వా మ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గురునాథ్ యాదవ్ కోరారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**పలాస, ఆగస్టు 7(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాసలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత రంగం మన దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం అన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాలలోని అనేక కుటుంబాలకు జీవనోపాధిగా నిలుస్తోందని చెప్పారు. ముఖ్యంగా చేనేత రంగంలో పనిచేసే కార్మికులలో అధిక భాగం స్త్రీలే కావడం, మహిళా సాధికారతకు గొప్ప ఉదాహరణ. 1905 ఆగస్టు 7న ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం, దేశీయ పరిశ్రమల అభివృద్ధికి బలం ఇచ్చింది. 2017లో చెన్నైలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని అధి,కారికంగా ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.గిరిజ, సునీత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



**సరుబుజ్జిలి, ఆగస్టు 7(వార్త):** 'తల్లిపాల సంస్కృతిని రక్షించుకుందాం. మనందరి బాధ్యతగా తీసుకుందాం' అనే నినాదంతో సరుబుజ్జిలిలో ప్రభుత్వాసుపత్రి ఆధ్వ ర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్యులు డాక్టర్ సాహితీ ప్రియదర్శిని తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నారు. 6 నెలల వయస్సు వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తరువాత అదనపు ఆహారం ఇస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు అందించవచ్చన్నారు. తల్లి పాలపై అపోహలకు లోను కావద్దన్నారు. తల్లి పాలు అమృతమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జలుమూరు, ఆగస్టు 7 (వార్త):** బిడ్డకు తొమ్మిది నెలల పాటు తల్లిపాలు అందించాలని, శిశువుకు ఇవి ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్వైజర్ సీతా రత్నం అన్నారు. శ్రీముఖలింగంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్క తల్లి తప్పనిసరిగా చంటి బిడ్డకు తల్లి పాలు మాత్రమే అందించాలన్నారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు.



**మందస, ఆగస్టు 7(వార్త):** బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు పెట్టాలని అవి శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్‌వీ రామలక్ష్మి అన్నారు. మందస మండలంలోని హరిపురం సెక్టార్-1 పరిధిలోని హరిపురం అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని, బిడ్డకి తల్లి పాలను ఇవ్వడం వలన తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యం మెరుగుగా ఉంటుందన్నారు. పిల్లలకు కూడా ఇన్ఫెక్షన్లు, డయేరియా, వాంతులు వంటి సమస్యలు రావని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణు లకు సీమంతం జరిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పి.జయలక్ష్మి, జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546